# అంటరానితనం



UNTOUCHABILITY
(Telugu)

# అంటరానితనం

మూలం:

మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై)

అనువాదం:

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ బి.ఏ.

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

# Antaraanitanam
# Untouchability (Telugu)

TIP Series. No. **25**

Author : Maulana Maududi

Translated by : Muhammad Azeezurrahman

All Rights Reserved with Publishers

$10^{th}$ Edition : January 2018

Copies : 2000

**Price** : **Rs. 25**

ISBN : 81 - 86826 - 26 - 2

Published by **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583

e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# మా మాట

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల కోసం మానవుడు నిరంతరం పోరాడుతూనే ఉన్నాడు. అయినా మానవులలో ఒక వర్గం వీటిని పూర్తిగా అనుభవించలేకపోతోంది. మానవులు నిర్మించుకున్న మత ధర్మాలలో, నూతనంగా ఆవిర్భవించిన నేటి అసహజ సిద్ధాంతాలలో ఈ లోపం ఇప్పటికీ కొట్టవచ్చినట్లు కానవస్తోంది. తత్ఫలితంగా మానవుల మధ్య జనించిన నిమ్నోన్నతా భావాల జాడ్యం సమాజాన్ని పట్టి పీడిస్తోంది. ఇక ఒక చోట కులతత్వం రూపంలో స్వైర విహారం చేస్తుంటే మరో చోట వర్ణ విభేదం రూపంలో విలయతాండవమాడుతోంది. ఇంకొక చోట జాత్యహంకారం రూపంలో సమాజాన్ని సతమతం చేస్తోంది.

ముఖ్యంగా మన దేశంలో ఈ నిమ్నోన్నతా భావాల మహమ్మారి యుగయుగాల నుంచి ఒక వర్గాన్ని అణగద్రొక్కుతూ వస్తోంది. అనేక సంఘ సంస్కర్తల అవిరళ కృషి కూడా ఈ భయంకర వ్యాధిని నివారించలేకపోయింది. అస్పృశ్యతా నివారణ ఈనాటికీ ఒక నినాదంగానే మిగిలిపోయింది. కుల వ్యవస్థ ప్రాతిపదికగా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు బలహీన వర్గాలకు సమాజంలో సమాన స్థాయిని, వారికి కరువు అయిన గౌరవ మర్యాదల్ని ఇవ్వలేకపోతున్నాయి. అగ్ర కులాలు, అల్ప కులాలన్న తారతమ్యం సమసి పోలేదు. అధమ కులాల వారిపై రోజుకు రోజు హింసా దౌర్జన్యాలు అధికమవుతూ ఉన్నాయే తప్ప తగ్గే సూచనలు కానరావడం లేదు.

ఇలాంటి భయంకర వ్యాధికి సరయిన చికిత్స కొరకు భౌతికపరమయిన విషయాల్లో వెదకి, విసిగిపోయి, చివరికి అసలు ఈ సమస్య ఇక తీరదా? అని పలువురు విచారపడటం సహజమే. కాని సకల మానవులకు ప్రభువయిన

దైవం ప్రతి యుగంలోనూ, ప్రతి జాతిలోనూ తన సత్య సందేశహరుల ద్వారా ఇలాంటి సామాజిక రుగ్మతలకు నివారణ చూపిస్తూనే ఉన్నాడు. తాను పంపిన చివరి సందేశంలో కూడా మానవులంతా సమానులే అని, పరస్పరం సోదరులే అని తెలిపాడు ఆయన.

ఈ యదార్థాన్ని ప్రఖ్యాత ఇస్లామీయ తత్వవేత్త మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై) వ్రాసిన దివ్యఖుర్ఆన్ వ్యాఖ్యానమైన 'తఫ్‌హీముల్ ఖుర్ఆన్' నుండి సేకరించి ప్రచురిస్తున్నాము. దీని ద్వారా ప్రజల్లో మూఢత్వం, అజ్ఞానం మూలంగా ప్రబలి ఉన్న అల్పమయిన భావాలు అంతమై, వారు సహజ రూపంలో దైవదాసులుగా, సమానులుగా అలరారగలరని ఆశిస్తున్నాము.

ఖండాల మధ్య దూరం కుంచించుకు పోతున్న నేటి కాలంలో కూడా భారత దేశంలోని అగ్రవర్ణాల అంతరంగాల్లో దళిత సోదరులకు స్థానమంటూ లేకపోగా దూరాలు ఇంకా పెరిగిపోతూనే వున్నాయి. ప్రభుత్వం పైకి అంటరానితనం అమానుషమని ఎన్ని ప్రకటనలు కుమ్మరించినా ఈ దేశంలో ఇంకా దళితులపై అణచివేత ఘాతుకాలు ముమ్మరంగా, పకడ్బందీగా సాగుతూనే వున్నాయి. మన సమకాలీన సమాజంలో కూడా పదిరికుప్పం, దండు మల్లాపూర్, చుండూరు ఇంకా.... ఇంకా.... దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వారిపై జరిగిన అలాంటి ఎన్నో దౌర్జన్య దుర్ఘటనల్లో కొన్నింటిని ఈ పుస్తకం చివర్లో పొందుపరిచాము.

- ప్రకాశకులు

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# అంటరానితనం

## ప్రకృతికి విరుద్ధం

అసమానత, అంటరానితనం లేక నిమ్నోన్నతా భావాలు ఏ సమాజానికయినా చీడల్లాంటివి. ఈ జాడ్యాలతో సతమతమయ్యే ఏ దేశమయినా శాంతీ శ్రేయాలకు నిలయం కావటానికి, వాస్తవాభివృద్ధిని సాధించడానికి ఆస్కారముండదు. ఇలాంటి దేశం పరస్పర వైషమ్యాలు, విద్వేషాలు, స్వార్థప్రియత్వం, స్వప్రయోజనాభిలాషల్లాంటి ప్రమాదకరమైన జాడ్యాలకు గురై, అంతర్యుద్ధానికి లోనవుతుంది. మనిషి మనిషికి మధ్య విచక్షణను చూపటం, ఒకరిని అధికునిగా, మరొకరిని అల్పునిగా ఎంచటం- ఈ విచక్షణ వర్ణం, వంశం ప్రాతిపదికపైనయినా, లేక ఆస్తి అంతస్తుల కారణంగానయినా, లేక దేశం, సమాజాల ఆధారంగానయినా - ఇది సమాజ స్వరూపంపై వికృతమయిన మచ్చలాంటిది.

పరిశీలనగా చూస్తే తెలిసేదేమంటే, అంటరానితనం మరియు నిమ్నోన్నతా భావాలు ప్రకృతి విరుద్ధమయిన విషయాలు. నేడు మన దేశం ఈ శాపానికే గురయింది. తోటి మానవ సోదరులను జంతువులకన్నా హీనంగా భావించటం జరుగుతోంది. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం ప్రతినిత్యం మీకు లభిస్తుంది. ఉదాహరణకు కుక్క కంచాన్ని ముట్టుకుంటే చాలా మంది దాన్ని పట్టించుకోరు. దాన్ని 'అంటు' గా భావించరు. ఎలాంటి అసహ్యం కనబరచకుండా ఆ కంచాన్ని వాడతారు. కాని ఒక హరిజనుడు- అతడూ మానవుడే అయినా - అతని చెయ్యి తగిలినా తమ వస్తువు

'అపరిశుద్ధం' అయినట్లుగా భావిస్తారు. హరిజనులయితే సరేసరి. ముస్లిముల పట్ల కూడా ఇదే విధంగా ప్రవర్తించడం జరుగుతోంది. ఎంత విచారకరం, మరెంత దుఃఖకరమయిన విషయం ఇది! మానవత్వంపై ఎంత పెద్ద జులుం ఇది!!

## ఆదరణీయులెవరు?

సృష్టికర్త దృష్టిలో యావత్తు మానవాళి సమానమే. అందరూ దైవదాసులే. వారు ఏ దేశానికి, ఏ వంశానికి, ఏ జాతికి చెందిన వారైనా సరే, హరిజనుడైనా, పండిత బ్రాహ్మణులయినా, దూదేకుల వారు అయినా, సయ్యిదులు, పఠానులైనా, ఆర్యులైనా, ద్రవిడులయినా వీరందరినీ దేవుడు సృష్టించాడు. ఆయన తన వరాలను యావత్తు మానవాళి కొరకు ప్రసాదించాడు. గాలి, నీరు, సూర్యచంద్రాదులను ప్రతి వ్యక్తి కొరకు అనుగ్రహించాడు. విచక్షణారహితంగా అందరికీ జనన మరణాలు, తినడానికి, త్రాగడానికి, చూడటానికి, వినడానికి, మాట్లాడడానికి సమానమయిన పద్ధతులనే ఇచ్చాడు. మానవులందరి నరాల్లోనూ ఒకే విధమయిన రక్తం ప్రవహిస్తుంది. అందరి శరీర అవయవాలు ఒకే విధమయినవే, అన్నింటికన్నా ముఖ్య విషయం ఏమంటే, మానవాళి అంతా ఒకే తల్లిదండ్రులయిన ఆదం - హవ్వాల సంతతి కనుక అందరూ ఒకే వంశానికి మరియు ఒకే "కులానికి" - మానవ కులానికి - చెందినవారు. అటువంటప్పుడు ఒకరిపై మరొకరికి ఆధిక్యత ఉందని అనడానికి ఆస్కారమేముంది? ఇస్లామ్ దీనికి బద్ధ విరోధి. ఇస్లామ్ దృష్టిలో విచక్షణ అంటూ ఉంటే అది ఒక్కటే. అది: మంచీ-చెడుకూ, దైవభక్తి-దైవతిరస్కారానికి మధ్య ఉండే వ్యత్యాసం మాత్రమే. ఇస్లామ్ ప్రకారం దైవ భక్తుడు మరియు ఋజువర్తనుడు, దైవతిరస్కారి మరియు చెడువర్తనునికన్నా ఎంతో ఉత్తమమయినవాడు, శ్రేష్ఠుడు. ఈ విచక్షణను - ఇంగితజ్ఞానమున్నవారు, ప్రపంచంలో బుద్ధీ వివేకాలున్న వారందరూ అంగీకరిస్తారు. మిగతా విచక్షణలన్నీ సరయినవి కావు. వాటిని

నిర్మూలించడానికి మనమందరం సమాయత్తమవడం సబబే. ఈ విషయాన్నే దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా తెలిపింది.

> "ప్రజలారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు మరియు స్త్రీ ద్వారా పుట్టించాము మరియు జాతులుగా, వంశాలుగా చేశాము - మీరు ఒకరి నొకరు గుర్తించుకోడానికి. వాస్తవానికి ఎవరయితే మీలో అందరికన్నా ఎక్కువ దైవభీతి కలవాడో, అతనే అల్లాహ్ వద్ద అందరికన్నా గౌరవనీయుడు. నిస్సందేహంగా అల్లాహ్‌కు అన్నీ తెలుసు. ఆయన అన్నీ ఎరిగినవాడు." *(అల్ హుజ్రాత్ - 13)*

దీని వివరణను ప్రముఖ ఆధునిక ఇస్లామీయ తత్వవేత్త మరియు దివ్యఖుర్‌ఆన్ గొప్ప వ్యాఖ్యాత మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై) తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ ఐదవ భాగంలో ఈ విధంగా తెలిపారు : -

"ఈ ఆయత్‌లో దేవుడు యావత్తు మానవాళిని సంబోధించి, ప్రపంచంలో సదా సర్వతోముఖ ఉపద్రవానికి కారణభూతమైన మార్గ భ్రష్టత్వాన్ని సంస్కరించాడు." అంటే, వంశం, వర్ణం, భాష, దేశం మరియు జాతీయతల ప్రాతిపదికపై ఏర్పడిన దురభిమానాన్ని దీని ద్వారా అంతం చేశాడు. ప్రాచీన కాలం నుండి నేటి వరకు అన్ని కాలాల్లోనూ మానవుడు సాధారణంగా మానవత్వాన్నే విస్మరించి తన చుట్టూ కొన్ని చిన్న చిన్న పరిధుల్ని అల్లుకుంటూ వచ్చాడు. ఆ పరిధిలో జన్మించిన వారిని తన వారుగా, దాని ఆవల జన్మించిన వారిని పరాయివారుగా నిర్ణయిస్తూ వచ్చాడు. ఈ పరిధులు హేతుబద్ధమయినవీ కావు, నైతిక విలువలపైన ఆధారపడి కూడా లేవు. ఇవి మానవుని యాదృచ్ఛిక జననం ఆధారంగా గీయబడ్డవే. ఈ పరిధులు ఒక చోట కుటుంబం లేక తెగ లేక ఒక వంశంలో

జన్మించడంపై ఆధారపడి ఉంటే, మరో చోట ఓ భౌగోళిక ప్రదేశంలో లేక ఓ ప్రత్యేక రంగు లేక ప్రత్యేక భాష మాట్లాడే జాతిలో జన్మించడంపై ఆధారభూతమై ఉన్నాయి.

## జాత్యహంకారం ఓ జులుం

ఈ పునాదులపై తన వారు - పరాయి వారని ఏర్పరచిన వివక్షత కేవలం 'తన' వారితో 'పరాయి' వారికన్నా ఎక్కువ అభిమానం, సహకారాలు చూపడం వరకు పరిమితమై ఉండలేదు. ఈ వివక్షత అన్నది విద్వేషం, వైషమ్యం, అవమానం, పరాభవం, దౌర్జన్యం, అత్యాచారం ఫలితంగా ఘోర మైన రూపాలను కూడా ధరించింది. దీనికోసం తాత్విక సిద్ధాంతాలను సృష్టించారు. కొత్త కొత్త మతాలు స్థాపించారు, చట్టాలు ఉనికిలోకి వచ్చాయి. నైతిక సూత్రాలను రూపొందించడం జరిగింది. ఆపై జాతులు, రాజ్యాలు వీటిని శాశ్వత నియమాలుగా మలుచుకుని శతాబ్దాల తరబడి అమలుజరిపాయి.

యూదులు ఈ ప్రాతిపదికపైనే బనీ ఇస్రాయీల్‌ని దైవం ఎన్నుకున్న ప్రజలుగా నిర్ణయించారు, తమ మత నియమాల్లో సయితం ఇస్రాయీలేతరుల హక్కుల్ని, స్థానాన్ని ఇస్రాయీలీయులకంటే తక్కువగా నిర్ణయించారు. ఈ విచక్షణే హిందువుల్లో వర్ణాశ్రమానికి జననమిచ్చింది. దీని ప్రకారమే బ్రాహ్మణుల ఆధిక్యత స్థాపించడమయింది. సవర్ణుల సమక్షంలో తతిమ్మా మానవులందరూ నీచులుగా, అశుద్ధులుగా నిర్ణయించబడ్డారు. శూద్రుల్ని అత్యంత నీచత్వపు అగాధాల్లోకి త్రోసివేశారు.

నల్లవారు - తెల్లవారు అనే విచక్షణ ఆఫ్రికా, అమెరికాలలో నల్లవారిపై జరిపిన "జులుమ్"ను గురించి చరిత్ర పుటల్లో అన్వేషించాల్సిన అవసరం లేదు. నేటి 20వ శతాబ్దంలోనూ ప్రతి వ్యక్తి కళ్ళారా దాన్ని చూడగలడు. యూరోపియన్లు అమెరికా ఖండంలో ప్రవేశించి రెడ్ ఇండియన్ తెగవారితో ప్రవర్తించిన తీరు, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో బలహీనులపై ఆధిక్యతను

స్థాపించి వారి పట్ల అవలంబించిన అమానుష వైఖరి వెనుక ఉన్న భావన కూడా ఇదే. అంటే, తమ జన్మభూమి, తమ జాతి పరిధులకు ఆవల జన్మించిన వారి ధన ప్రాణాలు, గౌరవ మర్యాదను వారు అంతం చేసినా దోషం లేదు. వారిని దోచుకోవటానికి, బానిసలుగా చేసుకోవటానికి ఇంకా అవసరమయితే నేలపై నిలువ నీడ లేకుండా చెయ్యడానికి వీరికి హక్కు ఉంది.

పశ్చిమ దేశాల వారి జాత్యహంకారం ఓ జాతిని మరో జాతి పట్ల ఏ విధంగా క్రూరమృగంగా చేసిందో దాని తార్కాణాలు నిన్న మొన్నటి ప్రపంచ యుద్ధాల్లో చూచాము. ఇప్పటికీ ఇలాంటి దృష్టాంతాలు కానవస్తూనే ఉన్నాయి. ప్రత్యేకంగా జర్మనీ నాజీల జాత్యహంకార తత్వం, నార్డిక్ (Nordic) జాతి ఆధిక్యతా భావన రెండో ప్రపంచ యుద్ధంలో చూపిన మహిమల్ని దృష్టిలో ఉంచుకుంటే జాతి విచక్షణ ఎంత పెద్ద వినాశకరమయిన మార్గ విహీనతో సులభంగా బోధపడుతుంది. దీన్ని సంస్కరించడానికే దివ్యఖుర్ఆన్‌లోని ఈ ఆయత్ అవతరించింది. ఈ ఆయత్‌లో యావత్తు మానవాళినీ సంబోధిస్తూ అల్లాహ్, మూడు అతి ముఖ్యమైన సూత్రప్రాయమైన వాస్తవాలను వెల్లడించాడు.

## ఆదం - హవ్వాల సంతానం

ఒకటి : మీ అందరి మూలాధారం ఒక్కటే. ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా యావత్తు మానవరాశి ఉనికిలోకి వచ్చింది. ఇంకా, నేడు ప్రపంచంలో ఉన్న మీ జాతులన్నీ వాస్తవంగా ఒకే మౌలిక వంశవృక్షానికి శాఖలే. అది ఒకే తల్లి, తండ్రి ద్వారా ప్రారంభమయింది. మీరు భ్రమపడుతున్నట్లు ఈ సృష్టి క్రమంలో ఎక్కడా ఇలాంటి విచక్షణలకు, నిమ్నోన్నతా భావాలకు ఎలాంటి ఆధారం లేదు. ఇవి కేవలం మీ తప్పుడు భావనలు.

ఒక్క దేవుడే మీ సృష్టి కర్త. వివిధ దేవుళ్ళు సృష్టించడం జరగలేదు. మీరంతా ఒకే విధమైన సృజన పదార్థంతో చేయబడ్డారు. కొందరు పరిశుద్ధమైన లేక ఉత్తమమైన పదార్థంతో తయారుచేయబడటం, మరికొందరు అశుద్ధమైన లేక అల్పమైన పదార్థంతో చేయబడటం అన్నది జరగలేదు. మీరంతా ఒకే రీతిలో జన్మించారు. వివిధ రీతుల్లో జన్మించడం జరుగలేదు. మీరంతా ఒకే తల్లిదండ్రుల సంతానమే. ప్రారంభంలో మానవ జంటలు చాలా మంది ఉండి వారి ద్వారా ప్రపంచపు విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రజలు వేర్వేరుగా జన్మించడమూ జరుగలేదు.

రెండోదేమంటే, జన్మతః ఒక్కటే అయినప్పటికీ మీరు జాతులు, తెగలుగా విభజించబడడం సహజమయిన విషయమే. వాస్తవమేమంటే, ప్రపంచం మొత్తాన నివసించే యావత్తు మానవాళి ఒకే కుటుంబంలో ఉండటం సాధ్యపడదు. సంతానం పెరగటంతోపాటు అసంఖ్యాకమయిన కుటుంబాలు ఏర్పడ్డం, ఆపై వాటి నుంచి జాతులు, తెగలు ఉనికిలోకి రావడం అనివార్యమయిన విషయం. ఇదే విధంగా వివిధ ప్రదేశాల్లో ప్రజలు నివాసమేర్పరచుకున్న తరువాత వారి రంగు, శరీర నిర్మాణం, భావాలు, జీవన విధానాలు సయితం విభిన్నమవడం కూడా సహజమే. ఒకే ప్రాంతంలో ఉండేవారు పరస్పరం చేరువగానూ, దూర ప్రాంతాల్లో ఉండేవారు దూరంగానే ఉండటం కూడా సహజమే. అంత మాత్రాన ఈ సహజ విభేదాలు, వ్యత్యాసాల ఆధారంగా నిమ్నోన్నతా భావాలు, కులీనులు, క్షుద్రులు, అధికులు - అధములు అన్న విచక్షణలు ఏర్పడటానికి ఎంత మాత్రం ఆస్కారం లేదు. ఇంకా ఒక వంశం మరో వంశంపై ప్రాముఖ్యాన్ని కలిగి ఉండటానికి, ఒక రంగుగల ప్రజలు మరో రంగు ప్రజలను నీచులుగా, క్షుద్రులుగా భావించటానికి, ఒక జాతి మరో జాతిపై తన ఆధిక్యతను నెలకొల్పడానికి, మానవ హక్కుల్లో ఒక వర్గానికి మరో వర్గంపై ప్రాధాన్యత ప్రాప్తం కావడానికి కూడా ప్రాతిపదికలు ఎంత మాత్రం కారాదు.

సృష్టికర్త మానవుల్ని జాతులు, తెగల రూపాల్లో మలచడానికి ప్రధాన కారణం ఏమంటే, వారి మధ్య పరస్పర పరిచయానికి, సహకారానికి సహజ రూపం ఇదొక్కటే సాధ్యం. ఈ విధంగానే ఒక కుటుంబం, ఒక వర్గం, ఒక తెగ, ఒక జాతి - వారంతా కలసి ఓ మిశ్రమ సమాజాన్ని స్థాపించగలిగేవారు తమ జీవన వ్యవహారాల్లో పరస్పరం ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకోగలిగేవారు. ఏ సహజ వ్యత్యాసాలను దైవం మానవులను పరస్పర పరిచయం సహకారాల కొరకు సృష్టించాడో వాటిని ప్రజలు కేవలం పైశాచిక మూఢత్వంచేత మనుషుల మధ్య అహంకారానికి, విద్వేషానికి మార్గాలుగా ఏర్పరచుకున్నారు. పర్యవసానంగా హింసా దౌర్జన్యాలు, అత్యాచారాలు మొదలయ్యాయి.

మూడోదేమంటే, మనిషి మనిషికీ మధ్య శ్రేష్ఠతకు, ఆధిక్యతకు ప్రాతిపదిక ఏదయినా ఉంటే లేక ఉండగలిగితే అది కేవలం నైతిక శ్రేష్ఠత మాత్రమే. జన్మతః మానవులందరూ సమానమే. ఎందుకంటే వీరిని పుట్టించినవాడూ ఒక్కడే. అందరి సృష్టి మూల పదార్థం, జనన విధానం కూడా ఒకటే. ఇంకా అందరి వంశం కూడా ఒక తల్లి దండ్రుల ద్వారా ప్రారంభమయింది. అదీకాక ఎవరయినా ఓ ప్రత్యేక దేశంలోనూ, జాతిలోనూ, ప్రత్యేక వర్గంలోనూ జన్మించడం యాదృచ్ఛికమే గాని అందులో ఆ వ్యక్తి సంకల్పానిగ్గాని, ఎన్నికకుగాని, ప్రయత్నానిగ్గాని ప్రమేయమే లేదు. దీని రీత్యా ఒకరిపై మరొకరికి ఆధిక్యత ఉండటానికి కూడా బలమయిన కారణం అంటూ ఏదీ లేదు. ఒక వ్యక్తికి మరో వ్యక్తిపై ఆధిక్యత, ప్రాముఖ్యత లభించడానికి ఏదైనా కారణం కాగలుగుతుందంటే, వాస్తవానికి అతడు ఇతరుల కంటే అధికంగా దైవానికి భయపడేవాడు. చెండు నుండి, పాపాల నుండి తప్పించుకునేవాడు, సన్మార్గాన్ని, పవిత్ర మార్గాన్ని అవలంబించేవాడై ఉండటం అన్నదే. ఇలాంటి వ్యక్తి ఏ వంశానికి, ఏ జాతికి, ఏ దేశానికి చెందినవాడయినా సరే తనలోని ఉన్నత గుణగణాల రీత్యా ఆదరణీయుడే.

దీనికి భిన్నమయిన వ్యక్తి తెల్లవాడయినా - నల్లవాడయినా, ప్రాచ్యుడైనా-పాశ్చాత్యుడైనా అధమ శ్రేణికి చెందినవాడే.

## మహాప్రవక్త బోధనల్లో

ఈ వాస్తవాలనే దివ్యఖుర్ఆన్‌లోని ఒక చిన్న ఆయత్‌లో బోధించడం జరిగింది. మహాప్రవక్త (సఅసం) దీన్ని తన వివిధ ప్రసంగాల్లో, బోధనల్లో విశదంగా వివరించి చెప్పారు. మక్కా విజయం సందర్భంలో కాబా ప్రదక్షిణ తరువాత ఆయన ప్రసంగిస్తూ ఇలా అన్నారు :

> "అజ్ఞానపు మచ్చను, దాని అహంకారాన్ని దూరం చేసిన ఆ దైవానికి ఎనలేని కృతజ్ఞతలు. ప్రజలారా! మానవులందరూ రెండు భాగాలుగానే విభజించబడతారు. ఒకటి, సజ్జనులు మరియు దైవభీతి కలవారు. వారు దైవ సాన్నిధ్యంలో అత్యంత ఆదరణీయులు. రెండు, దైవాజ్ఞల్ని ఉల్లంఘించేవారు. కఠిన హృదయులు. వారు దైవం దృష్టిలో నీచులు. నిజానికి యావత్తు మానవాళి ఆదమ్ సంతానమే. ఆదమ్ (అస్సలామ్)ను అల్లాహ్ మట్టితో సృష్టించాడు." *(తిర్మిజి)*

అంతిమ హజ్ యాత్ర సందర్భంగా మహాప్రవక్త (సఅసం) తన సహచరులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు :

"ప్రజలారా! తెలుసుకోండి, మీ అందరి దేవుడు ఒక్కడే. ఒక అరబ్బుకు అరబ్బేతరునిపై, అరబ్బేతరునికి అరబ్బుపై, తెల్లవానికి నల్లవానిపై, నల్లవానికి తెల్లవానిపై ఎలాంటి ఆధిక్యత లేదు - భయభక్తుల రీత్యా తప్ప. అందరికంటే ఎక్కువగా దైవానికి భయపడేవాడే దైవ సాన్నిధ్యంలో మీలో అందరికంటే ఎక్కువ ఆదరణీయుడు. చెప్పండి, నేను అంతా మీకు అందజేశానా?" అని ప్రవక్త ప్రశ్నించారు. ప్రజలంతా అన్నారు, "అవును మహాప్రవక్తా!" ప్రవక్త తిరిగి అన్నారు,

"అయితే ఇక్కడ ఉన్నవారు ఈ విషయాన్ని ఇక్కడ లేని వారికి అందజెయ్యాలి." *(బైహకీ)*

ఒక హదీసులో ఆయన ఇలా ప్రశ్నించారు :

"మీరంతా ఆదమ్ (అస్సలామ్) సంతానమే. ఆదమ్ (అస్సలామ్) మట్టితో సృజించబడ్డారు. ప్రజలు తమ తాత ముత్తాతల ఔన్నత్యాలపై గర్వించడాన్ని విడనాడాలి. లేకపోతే వారు దైవ సాన్నిధ్యంలో పురుగు కంటే ఎక్కువ నీచులు కాగలరు." *(బజాజ్)*

మరో హదీసులో ఆయన అన్నారు :

"అల్లాహ్ ప్రళయ దినం నాడు మీ వంశ వృక్షాన్ని చూడడు. ఎవరయితే అందరికంటే ఎక్కువగా దైవానికి భయపడతాడో అతనే అల్లాహ్ వద్ద అందరికంటే ఎక్కువగా గౌరవనీయుడు." (ఇబ్ను జరీర్)

ఇంకో హదీసు మాటలు ఇలా ఉన్నాయి :

"అల్లాహ్ మీ రూపురేఖల్ని, సిరిసంపదల్ని కాదు, ఆయన మీ మనస్సుల్ని, కర్మల్నీ చూస్తాడు." *(ముస్లిమ్ - ఇబ్ను మాజ)*

## ఇస్లాం - సౌభ్రాత్ర వ్యవస్థ

ఈ ప్రవచనాలు కేవలం మాటల వరకే పరిమితం కాలేదు. ఇస్లాం ఆ మేరకు ఆచరణాత్మకంగా ఓ విశ్వమానవ సౌభ్రాతృత్వ వ్యవస్థను నెలకొల్పింది. ఇందులో వర్ణం, వంశం, భాష, ప్రాంతం మరియు జాతీయ విచక్షణ లేదు. ఇందులో నిమ్నోన్నతా భావాలు, అంటరానితనం, ఈర్ష్యా విచక్షణా భావాలకు కూడా ఎలాంటి తావులేదు. ఈ వ్యవస్థలో చేరే మానవులందరూ ఏ వంశానికి, ఏ జాతికి, ఏ దేశానికి, ఏ ప్రాంతానికి చెందిన వారైనా సరే సమాన హక్కులతో చేరగలుగుతారు. అలా చేరారు కూడా.

మానవ సమానత్వం, ఏకత్వపు సూత్రాలు ఏ విధంగానయితే ముస్లిమ్ సమాజంలో కార్యరూపం ధరించి విజయవంతమయ్యాయో అటువంటి మరో ఉదాహరణ ఏ సమాజంలోనూ, మరే వ్యవస్థలోనూ కానరావని, ముందెన్నడూ కానరాలేదని ఇస్లామ్ వ్యతిరేకులు సయితం ఒప్పుకోవాల్సి వచ్చింది. కేవలం ఒక్క ఇస్లామ్ ధర్మం మాత్రమే ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో వ్యాపించి ఉన్న అసంఖ్యాకమైన వంశాలను కలిపి ఒకే సమాజంగా చేయగలిగింది.

ఈ సందర్భంగా ఒక అపోహను దూరం చెయ్యాల్సిన అవసరం కూడా ఉంది, వివాహ విషయంలో ఇస్లామీయ షరీఅత్ కుఫ్వ్ (సమత్వం) అనే విషయానికి యిచ్చిన ప్రాముఖ్యతను కొందరు తప్పుగా భావిస్తారు. కొన్ని వంశాలు శ్రేష్ఠమయినవనీ, కొన్ని నీచమైనవనీ ఆ కారణంగా వీటి మధ్య వియ్యం అభ్యంతరకరమని దానికి అర్థం ఆపాదిస్తారు. అయితే ఇది ఒక తప్పుడు అభిప్రాయం మాత్రమే. ఇస్లామీయ షరీఅత్ ప్రకారం ప్రతి ముస్లిమ్ పురుషుడు, ప్రతి ముస్లిమ్ స్త్రీతో వివాహమాడవచ్చు. అయితే దాపంత్య జీవితం సఫలం అవటమనేది ఆ దంపతులు పరస్పరం కలిసిమెలిసి ఉండేందుకు వీలుగా వారి అలవాట్లు, అభిరుచులు, జీవిత విధానాలు, కుటుంబ సంప్రదాయాలు, ఆర్థిక సామాజిక స్థితిగతులు మొదలైన విషయాల్లో వారి మధ్య సాధ్యమయినంత మేరకు సానుకూలత ఉండటంపై ఆధారపడి ఉంటుంది. కుఫ్వ్ అన్న దాని ఉద్దేశ్యం కూడా ఇదే. పై విషయాల్లో స్త్రీ పురుషుల మధ్య ఎక్కువ వ్యత్యాసం ఉంటే వారి దాంపత్యం జీవితాంతం నిలబడగలదని ఎక్కువగా ఆశించలేము. కనుక ఇస్లామీయ షరీఅత్ అలాంటి సంబంధం చేయటాన్ని ఇష్టపడదు. దంపతుల్లో ఒకరు శ్రేష్ఠులు, మరొకరు నీచులు అన్న దృష్ట్యా కాకుండా వారి పరిస్థితుల్లో ఎక్కువ

విభేదాలున్నట్లయితే వివాహ సంబంధాలను ఏర్పరచుకుంటే దాంపత్య జీవితాలు విఫలమయి పోవడానికి ఆస్కారం ఉంటుందని మాత్రమే షరీఅత్ అలాంటి సంబంధాన్ని ప్రోత్సహించదు.

పైన ఉదాహరించిన ఆయత్‌లలో "అల్లాహ్‌కు అన్నీ తెలుసు! ఆయన అన్నీ ఎరిగినవాడు" అని ఉంది. అంటే దీని అర్థం గుణగణాల రీత్యా ఎవరు ఉత్తముడో, ఎవరు అధముడో అల్లాహ్‌కు బాగా తెలుసు అని. ఆధిక్యతకూ, అల్పత్వానికి ప్రజలు కల్పించుకున్న ప్రమాణాలు అల్లాహ్ వద్ద చెల్లవు. ప్రపంచంలో గొప్ప హోదా కలవాడుగా, ఖ్యాతి గలవాడుగా పరిగణించబడిన వ్యక్తి దేవుని అంతిమ నిర్ణయంలో అధమస్థాయికి చెందినవాడు కావచ్చు. అలాగే ఇక్కడ అల్పుడుగా పరిగణించబడిన వ్యక్తి దైవ సాన్నిధ్యంలో గొప్ప హోదా పొందవచ్చు.

అసలు ప్రాముఖ్యత ప్రపంచంలో లభించే గౌరవ అవమానాలకు కాదు, దైవ సాన్నిధ్యంలో లభించే గౌరవ అవమానాలకే. కనుక మనిషికి, దైవ దృష్టిలో తనను గౌరవార్హుడిగా చేయగలిగే నిజమైన గుణగణాలను సృజించుకోవాలన్న తపన, చింత ఉండాలి.

## అంటరానితనం ఓ జాడ్యం

కుల, మత, జాతి విచక్షణ, విభేదాలు ఎవరు రూపొందించారు? అసలు అవి ఎలా వ్యాప్తి చెందాయి?

బలాధిక్యతగలవాడు నిత్యం బలహీనుణ్ణి దోచుకున్నాడు. ఈ దోపిడి సామాజిక రూపం ధరించినప్పుడు కులాలు, వర్ణాలు, వర్గాలు ఆవిర్భవించాయి. జాతులు అన్నవి పలు రకాలుగా ఉద్భవించాయి. దేశ ప్రాతిపదికగా, సంస్కృతి ప్రాతిపదికగా, భాష ప్రాతిపదికగా, ధార్మిక వ్యవస్థ ప్రాతిపదికగా నెలకొన్నాయి. ఇక మతాల విషయానికి వస్తే తేలేదేమిటంటే

దైవం తన దాసులయిన మానవులకు పంపిన ధర్మం నిత్యం ఒక్కటే. అది ఏ దేశంలో, ఏ జాతిలో, ఏ భాష మాట్లాడేవారిలో ఉన్నా దాని సారంరీత్యా అది ఒక్కటే. కాని ప్రజలు తమ వక్ర బుద్ధి కారణంగా, ఉపేక్ష మూలంగా, దుష్ట సంకల్పాల పరిపూర్తికి దాన్ని మార్చేసి తమకు ఇష్టమయిన రీతిలో పలు మతాలుగా సృష్టించుకున్నారు. అయితే ధర్మం సదా ఒక్కటే.

అసమానత, అంటరానితనం, నిమ్నోన్నతా భావాలు ఏ సమాజానికైనా చీడల్లాంటివి. ఈ జాడ్యాలతో సతమతమయ్యే ఏ దేశమయినా శాంతి శ్రేయాలకు నిలయమవడానికి, వాస్తవాభివృద్ధిని సాధించడానికి ఆస్కార ముండదు. ఇలాంటి దేశం, పరస్పర వైషమ్యాలు, అసహనం, స్వార్థప్రియత్వం, స్వప్రయోజనాభిలాష లాంటి ప్రాణాంతకమయిన జాడ్యాలకు గురై అంతర్యుద్ధానికి ఆలవాలమయిపోతుంది. మనిషి మనిషికి మధ్య విచక్షణ చూపటం, ఒకరిని అల్పునిగా, మరొకరిని అధికునిగా ఎంచడం - ఈ విచక్షణ వర్ణం, వంశం ప్రాతిపదికగా చూపబడినా లేక ఆస్తి అంతస్తులు కారణంగా రూపొందినా లేక దేశ సమాజాల ఆధారంగా ఏర్పడినా - సమాజ స్వరూపంపై అదొక వికృతమయిన మచ్చలాంటిది.

## దళిత వర్గాల స్థితి, నాడు - నేడు

1923వ సంవత్సరం వరకు స్వాతంత్ర్య సమరంలో దళిత జాతుల ప్రస్తావన అంటూ లేదు. నాటి మన సమాజంలో వారి స్థితి, బ్రిటిషు వారు మన పట్ల చూపుతున్న జాతి విచక్షణ కన్నా అధ్వాన్నంగా ఉండేదనడంలో ఎలాంటి సందేహం లేదు. వారు బహిష్కరింపబడి గ్రామం వెలుపల ఉండే వారు. గ్రామంలో ప్రవేశించేటప్పుడు వారు గంట మ్రోగించుకుని రావడం ఆచారంగా ఉండేది. వారు అగ్రవర్ణాల వారికి వీధుల్లో ఎదురు కారాదు. వారు ఉమ్మి వేయాలంటే మెడకు ముంత కట్టుకుని, నడిచిన మార్గాన్ని

తుడుచుకోడానికి చేత చీపిరి పట్టుకు నడవాలి. అలాంటప్పుడు పాఠశాలల్లో ప్రవేశానికి నోచుకోగలరా? ఇటువంటి వారికి స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ నాయకులు స్థానం కల్పిస్తారా? స్వాతంత్ర్యం అంటే వారి దృష్టిలో కేవలం అగ్రవర్ణాల సొత్తు మాత్రమే.

నేడు రాజకీయంగానూ, ఆర్థికంగానూ దళిత వర్గాల స్థితి చాలా వరకు మెరుగైనప్పటికీ సామాజికంగా వారి స్థితి దారుణంగానే ఉన్నది, స్వాతంత్ర్యాన్ని పొంది దశాబ్దాలు గడిచినా అంటరానితనం ఇంతవరకు పూర్తిగా నిర్మూలన కాలేదు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో వెనుకబడిన కులాల వారిని గ్రామ బహిష్కరణలో ఉంచిన ఉదంతాలు ముందుకు వస్తున్నాయి. మరి కొన్ని గ్రామాలలో పేరుకు మాత్రం అందరూ సమానులే. క్రియాత్మకంగా నిత్య జీవన వ్యవహారాల్లో వారు సమానంగా భాగస్వామ్యం పొందే భాగ్యానికి నోచుకోలేదు. ప్రజలచే ఎన్నుకోబడిన హరిజన ప్రజా ప్రతినిధులే సమస్థాయిలో సహజీవనానికి నోచుకోని మన ప్రజాస్వామిక సెక్యులర్ రాజ్యాంగ వ్యవస్థలో సామాన్య హరిజనుల మాటనెవరు అడిగారు? దేశంలో ఏ మూల కలత చెలరేగినా హింసాగ్ని జ్వాలలో మాడి పొయ్యేది బలహీన వర్గాల వారే. వారిపై జరిగే అత్యాచారాలను కప్పిపుచ్చడానికి రిజర్వేషన్ల సిద్ధాంతాన్ని ముడిపెట్టి ఉద్రేకులయిన హరిజనులను జోలపాటలతో శాంత పరుస్తున్నారు. వారిలో న్యూనతా భావాన్ని పారద్రోలి, ఆత్మాభిమానాన్ని ఆత్మ గౌరవాన్ని పెంపొందించి, దేశ నిర్మాణ కార్యంలో వారు సమాన హక్కుదారులనే భావనను సృజించడానికి ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు పాటుబడనంత వరకు, ప్రజలు వారిని చేరదీసి అందరితో కలిసిమెలిసి జీవించేలా చెయ్యనంతవరకు 'దళిత వర్గాలు' అనే పదం మన వ్రాతల్లో నుండి, మాటల్లో నుండి సమసిపోదు.

## ఓ సంఘటన

గతంలో కర్నూలు జిల్లా మంత్రాలయంలోని ఒక దేవాలయంలో ప్రవేశించనివ్వకుండా అప్పటి మన రాష్ట్ర శాసన సభ్యుడయిన శ్రీ ఎం. వీరన్నను అడ్డగించారు. హరిజనుడన్న కారణంగా శాసన సభ్యుడైన ఒక ప్రముఖ వ్యక్తి పట్లనే యింతటి అన్యాయం, అక్రమం, అవమానం జరిగిందంటే సాధారణ హరిజనుల పరిస్థితి ఏమిటి?

మన గ్రామసీమలు ఆధునిక ప్రజాతంత్ర విలువలకు, స్వేచ్ఛా సమానత్వ సూత్రాల ఆచరణకు ఎంత దూరంగా ఉండి పోతున్నాయో అను నిత్యం హరిజనులు, గిరిజనులు, ఇతర బలహీన వర్గాలకు చెందిన వారిపై జరుగుతోన్న అత్యాచారాల వార్తలే తెలియజేస్తున్నాయి. అసలు వార్తల "కెక్కని", లెక్కకురాని దారుణాల సంగతి సరేసరి. అస్పృశ్యత నివారణకు చట్టాలు, నిబంధనలు, శిక్షాస్మృతి, నిషేధాలు వగైరా బోలెడంత అమలుకురాని గ్రంథముంది.

అస్పృశ్యతా నివారణ కేవలం చట్టాలతో జరిగే పని కాదు. ఈ చట్టాలు సరిగా అమలు జరగటానికీ, రాజ్యాంగం ఘోషించే ప్రాథమిక హక్కులను అనుభవించడానికి అనువైన పరిస్థితులను కల్పించే మౌలిక, సామాజిక మార్పుల విషయం పట్టించుకోనంత కాలం ఈ దుస్థితి తప్పదు.

శాసన సభ్యుడు వీరన్నకు మంత్రాలయ మఠంలో ప్రవేశం లభించలేదు అన్నది అంత ముఖ్యం కాదు. అతడు అంటరానివాడు, నిమ్న జాతి వాడు కనుక అతనికి ప్రవేశార్హత లేదు అనేదే ముఖ్యం. ఈ సంఘటన రాష్ట్ర మంత్రి బాగారెడ్డి గారి సమక్షంలో జరిగింది అన్నది అంతకంటే ముఖ్యం. ప్రముఖ వ్యక్తులతో ఉన్న వీరన్న, గుడిలోకి మంత్రివర్యులతో ప్రవేశించిన వీరన్న అకస్మాత్తుగా మాయమయ్యాడన్న విషయం మంత్రిగారికి తెలియకపోవటం మరీ ముఖ్యం. ఇది ఒక వీరన్నకే కాదు, యావత్తు మానవ జాతికి అవమానం,

తలవంపు. అందరి సృష్టికర్త అయిన దేవుడే మానవుల్ని విభజించలేదు. ఆయన దృష్టిలో అంతా సమానులే. అలాంటప్పుడు మానవుల్ని ఈ విధంగా గొప్పవారుగా, నీచులుగా అభివర్ణించే హక్కు మనకు ఎవడిచ్చాడు?

## హరిజనోద్ధరణలో రాజకీయాలు!

హరిజనులపై దాడులు, వారి మహిళలపై అత్యాచారాలు, వారి ఇళ్ళ దహనం, వారి స్త్రీలను అర్ధనగ్నంగానూ, పూర్తి నగ్నంగానూ ఊరేగించి అవమానించడం - ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం ఈ దుర్ఘటనలను వాడుకునే నీచానికి రాజకీయ పార్టీలు వెనుకాడకపోవడమే శోచనీయం.

## 1. పదిరికుప్పంలో...

ప్రభుత్వం త్వరితగతిన పీడితుల్ని ఆదుకుని, వారి రక్షణకై హామీనిచ్చి న్యాయం జరిపిస్తానని ధైర్యం చెప్పాల్సింది. పదిరికుప్పం హరిజన సోదరులపై ఆనాడు అంతగా ఆవేదన, ఆందోళన పొంగిపొరలినట్లు ప్రవర్తించిన వారు - వారెవరయినా సరే - ఆ పీడిత సోదరుల రక్త కన్నీళ్ళను తుడిచి, మనసుల్ని శాంతపరచి, భస్మమయిన ఇళ్ళను నిర్మించడంలో, దూరమైన బ్రతుకు తెరువును ఇప్పించడంలో సహకరించాల్సింది. వాళ్ళ చల్లటి అభిమానాలను చూరగొనాల్సింది.

అంతేగాని చచ్చినవాడి బట్టలు అమ్ముకు తినడానికి ప్రయత్నించటం క్షమార్హం కాదు. కాంగ్రె పార్టీ వారు అప్పుడు చేసింది అంతే!

పదిరికుప్పం దుస్సంఘటనపై అంతగా రోదించిన కాంగ్రె నాయకులే అంతకు ముందు రాష్ట్ర రాజధాని నగరంలో హరిజనులపై జరిగిన అత్యాచా

రాలకు రాజధానిలో నిరసన ప్రదర్శన జరిగినపుడు వారిపై పోలీసుల ద్వారా లాఠీ చార్జి జరిపించి, హింసించిన వాస్తవాలను ప్రజలు ఆనాడే కాదు, నేటికీ మరువలేదు.

అయితే రాష్ట్రంలో 35 ఏండ్ల తరువాత అప్పుడు, ప్రతిపక్ష స్థానంలో కూర్చున్న కాంగ్రె నాయకులు పదిరికుప్పంలో తిష్ఠవేసి, ఆ హరిజన సోదరుల మనసుల్ని మరింత కలుషితం చేసి, కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై, దాని నాయకులపై, అనుమానాలను, భయాందోళనలను కలిగించే వాతావరణాన్ని సృష్టించటానికి చేసిన ప్రయత్నాలు చూస్తే వాళ్లలో ఆవగింజంత విజ్ఞత కూడా లేదనిపించింది. తెలుగుదేశం ప్రభుత్వం చేసే సహాయాన్ని నిరాకరించడానికి సయితం ఆ బాధితులు సిద్ధమవడం, ఇందిరమ్మ వచ్చి చూచే వరకు అలాగే ఉంటామని అనడం, హోం శాఖ సహాయ మంత్రి శ్రీ పెండేకంటి వెంకట సుబ్బయ్య వచ్చి అనాలోచిత ప్రకటనలు చేయటం - ఇదంతా ఆనాటి పచ్చి పొలిటికల్ స్టంట్ తప్ప మరేమీ కాదు.

## 2. దేవలీ

ఉత్తర ప్రదేశ్‌లోని దేవలీలో జరిగిన "నరమేధ యాగం," ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద ఓ గ్రామంలో జరిగిన అన్యాయం, ఆ అన్యాయాన్ని కప్పిపుచ్చడానికి అగ్రకులాలవారు వేసిన పిల్లి మొగ్గలు అన్నీ బాహాటంగా పలికేదేమిటీ?

అయితే కేవలం హరిజనుల సముద్ధరణ కొరకు విరాట్ హిందూ సమ్మేళనాన్ని నిర్వహించిన ఎన్నో సంస్థల 'జాతీయ' నాయకులు చేసే నిర్వాకమేమిటీ? దేవలీలో పారిన మానవ రక్తాన్ని అరికట్టడానికి ఆ విరాట్ సమ్మేళన్ నాయకులు ఒక్కరయినా కనీసం బయల్దేరినట్లు కానరాలేదు.

# 3. మొసలి కన్నీటిలో మల్కాపూర్

నల్గొండ జిల్లా రామన్న పేట సమితిలోని దండు మల్కాపూర్ గ్రామాన్ని ధర్మరక్షా మహాభియాన్ సమితివారు దత్తత తీసుకున్నారని, ఆ గ్రామ హరిజనవాడలోని సహకార సంఘం అధ్యక్షుని గృహంలో ఆర్య సమాజ నాయకుల సమక్షంలో యజ్ఞహోమాదులు జరిపించి హరిజనులకు యజ్ఞోపవీతాలను ప్రదానం చేశారని (12.8.81) ఒక వార్త వచ్చింది.

దేశ వ్యాప్తంగా హరిజనుల్లో ఇస్లామ్ స్వీకరణాసక్తి జనించడంతో అదిరిపడిన మహాత్మా దయానంద్ డెహ్రాడూన్ తపోవనం నుండి స్వయంగా ఈ గ్రామానికి వచ్చి సాంప్రదాయకంగా హోమాదులు జరిపించి దత్తత స్వీకరించినట్లు ఓ పత్రిక ఉటంకించింది.

అయితే అక్కడ విచారణ జరపగా అంతా బూటకమని, కొందరు నాయకులు వట్టి ప్రకటనలు చేసి పచ్చి మోసం చేస్తున్నారనీ, ప్రజల్ని పెడత్రోవ పట్టిస్తున్నారనీ తేలిపోయింది. హరిజనుల్ని పావులుగా వాడుకుని తమ పబ్బం గడుపుకోవాలని వీరంతా చూస్తున్నారన్నది యదార్థం. నిజానికి కొందరు సంపన్న రెడ్డి కుటుంబీకులకు, సహకార సంఘ అధ్యక్షునికి మాత్రమే యజ్ఞోపవీతం పేరుతో ధర్మరక్షా మహాభియాన్ చిహ్నాలుగల బిళ్ళలు కంఠంలో వ్రేలాడగట్టడానికి ఇచ్చినట్లు తెలిసింది. ఇదీ మల్కాపూర్ గ్రామ దత్తతలోని యదార్థం.

అగ్ర కులాలవారి చిహ్నమయిన యజ్ఞోపవీత ధారణ చేయించామని, కుల పట్టింపులను చీల్చి చెండాడుతామని పత్రికా ముఖంగా ప్రకటించుకున్న వీరు ఆ గ్రామ ప్రజలకు దేవుని ఏకత్వాన్ని గురించిగాని, మానవ సమతాభావాన్ని గురించిగాని, సౌభ్రాతృత్వాన్ని గురించి గాని ఒక్క ముక్కయినా బోధించక పోవడం విడ్డూరం.

# 4. అహ్మదాబాద్‌లో....

అహ్మదాబాద్‌లో రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళన యావద్దేశ దృష్టిని ఆ సమస్య వైపునకు మళ్ళించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గుజరాత్ ప్రభుత్వం దళిత వర్గాల విద్యార్థులకు విద్యాలయాల్లో రిజర్వేషన్ కోటాను 31 శాతం నుండి 49 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. మధ్యప్రదేశ్‌లో అర్జున్‌సింగ్ ప్రభుత్వం తను మాత్రం తక్కువ తిన్నానా అని ఈ పరిమితిని ఏకంగా 77 శాతానికి పెంచేసింది. ఈ చర్య వెనుక దళిత, బడుగు వర్గాలను ఉద్ధరించాలన్న చిత్త శుద్ధికన్నా, రాష్ట్రాల్లో 50 శాతం కంటే అధికంగా ఉన్న వారి ఓట్ల బ్యాంకును కొల్లగొట్టాలన్నదే పాలకుల ప్రధాన ధ్యేయంగా కనిపిస్తోంది.

"బడుగు వర్గాల జాబితా"లోకి రాని విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయం కోపకారణమైంది. అగ్రవర్ణాల విద్యార్థులు సోలంకిపై "ధర్మయుద్ధం" ప్రకటించారు. విద్యార్థులు ముందుగా ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ "అంత్యక్రియల"కు సూచనగా గంటలు గణగణ మ్రోగాయి. ఎవరో రాయి విసిరారు. ఒక బాలుడు గాయపడ్డాడు. అంతే ఇక మానవత నిద్రలోకి జారుకుంది. పైశాచికత్వం విజృంభించింది. శాసనోల్లంఘన మొదలయింది. రాళ్ళు రువ్వుకోవడాలు, కత్తిపోట్లు, లూటీ, దహన కాండ - పాత బస్తీ అంతా క్షణాల్లో అల్లకల్లోలంగా మారిపోయింది. పోలీసులు తీరిగ్గా రంగంలోకి దిగే వరకు జరగవలసిన ధన, ప్రాణాల నష్టం జరిగిపోయింది. తరువాత కర్ఫ్యూ ఆజ్ఞలు జారీ అయినాయి.

మరునాడు ఉదయం నుండి అల్ప సంఖ్యాకుల దుకాణాల నిలువు దోపిడి కొనసాగింది. దెహ్లీ దర్వాజాలో పోలీస్ స్టేషన్‌కు దగ్గరలోనే ఉన్న దుకాణాలను తీరిగ్గా దోచుకున్నారు. తీన్ దర్వాజె ప్రాంతంలో పోలీస్ స్టేషన్‌కు కేవలం వంద గజాల దూరంలో ఉన్న దుకాణాలు కాలి భస్మీపటల మయ్యాయి.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఆందోళన సమాజంలోని 'ఒక వర్గం ప్రజలపై దాడి'గా మారిపోయింది. నిజానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంత దహనకాండ జరిగి ఉంటే మామూలుగా ప్రభుత్వ కార్యాలయాలు, మోటారు వాహనాలు దాడికి గురి అయి ఉండాల్సింది. నాడు అహ్మదాబాద్ పాత బస్తీని సందర్శించి నిష్పక్షపాతంగా పరిశోధించిన వారెవరయినా ఇట్టే అనేస్తారు - ఇది ఏక పక్షంగా ఒక వర్గం వారిపై ఓ పథకం ప్రకారం జరిగిన జులుం అని. విచిత్రం ఏమిటంటే అక్కడ అంత దారుణం జరిగినా ప్రభుత్వం దాన్ని మత కల్లోలంగా ప్రకటించదలచుకోలేదు. చెదురు మదురుగానో, పథకం ప్రకారం పెద్ద ఎత్తునో ఈ దళితులపై అత్యాచారం జరగని రోజంటూ లేదు. నల్లగొండ జిల్లాలోని చిలకుర్తి గ్రామంలో చదువు సంధ్యలు లేక, ఆర్థికంగా చితికిన కుటుంబీకురాలు ముత్తమ్మ అయినా, క్రిష్ణా జిల్లా అగిరపల్లి గ్రామంలో ఎం.బి.బి.ఎస్. పట్టభద్రుడు - సామాన్య ప్రజల్లో కొద్దో గొప్పో పలుకుబడి వున్న ఒక డాక్టర్ అయినా, దళితులు, అగ్రకులస్తుల ఆగ్రహానికి గురి అయినప్పుడు - వీరి బట్టలు వూడదీసి వీధులెమ్మట తన్నుకుంటు, తిట్టుకుంటూ త్రిప్పే అత్యాచారాలలో పత్రికలకు కొన్ని ఎక్కితే, పత్రికల దృష్టికి ఆననివి ఎన్నో!

## ఇక చుండూరు విషయం

చుండూరులో దళితుల్ని పథకం ప్రకారం ఇళ్ళ నుండి బయటకు రప్పించి, ట్రాక్టర్లతో వెంటాడి, పోలీసుల సహాయంతో అతి క్రూరంగా అడవి జంతువుల్ని వేటాడినట్లు వేటాడి చంపారు. సినిమా హాలు వద్ద జరిగిన చిన్న ఘర్షణ ఈ దారుణ మారణహోమానికి కారణమంటున్నారు. ఆకతాయిలు, ఆగడాలు చేసేవారు ఎవరో కొందరయితే వాళ్ళని శిక్షించాలిగాని మొత్తం మాలపల్లి ఏం చేసింది? అన్న ప్రశ్నను అనేకులు లేవనెత్తుతూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

అలాగే కడప జిల్లా శ్రీరామనగర్ అనే గ్రామంలో సాయంకాలం పూట తమ గుడిసెల ముందర మంచాలు వేసుకుని కూర్చొని వున్న దళితులు కొందరు, అగ్రకులాల వారు అటు నుండి వెళ్ళినప్పుడు మంచాలపై నుండి లేవకపోవడం కలహాలకు కారణమయ్యింది.

గత పది సంవత్సరాలుగా దళితులు తమ హక్కుల్ని గుర్తిస్తున్నారు. ఎదురుతిరిగి ప్రశ్నిస్తున్నారు. అగ్రకులాలు ఈ ధోరణిని సహించలేకపోయాయి. ఒకప్పుడు చెప్పులు లేకుండా తలవంచుకుని నడిచేవాళ్ళు నేడు ప్రభుత్వోద్యోగాలు చేస్తున్నారు - వాళ్ళ పోరాటం ఫలితంగా రిజర్వేషన్లు దొరికాయి. రిజర్వేషన్ల వల్ల వాళ్ళకు ఉద్యోగాలు వచ్చాయి. ఉద్యోగాల వల్ల వాళ్ళకు ఆత్మగౌరవం వచ్చింది. దళితులకు రాజకీయాధికారం వచ్చే అవకాశం కనబడుతూంది. వాళ్ళకెందుకు ఇన్ని అధికారాలు అన్న అసహనంతో దాడులు జరుగుతున్నాయి. చాలా చోట్ల చిన్న చిన్న ఘర్షణలే కారణాలవుతున్నాయి. చిత్తూరు జిల్లాలో ఎస్సీలు బూట్లు వేసుకుని ఊళ్ళోకి పోతే మీకివాళ్ళ బూట్లెందుకురా అని దాడి చేశారు. అగ్రకుల నాయకత్వం ఈ పరిణామాల్ని సహించలేకపోతున్నది.

## దళితుల ధర్మపరివర్తన

గత యాభై ఏళ్ళుగా మతం మార్పును గురించి పలువురు ఆందోళన వెలిబుచ్చుతూ, వారికి తోచిన వ్యాఖ్యలు చేస్తూ, వారికి వీలుపడిన నివారణోపాయాలు చేబట్టుతూనే వున్నారు. అయితే ఈ సందర్భంలో ఆలోచించవలసిన అసలు విషయాన్ని అందరూ విస్మరిస్తూ వచ్చారు.

హరిజనులైనా, మరే పీడిత దళిత వర్గం వారయినా ధర్మపరివర్తనకు ఎందుకు సిద్ధమవుతున్నారు? ఆ పరివర్తనానికి వెనుకనున్న గాథ ఏమిటి?

నేడు, స్వాతంత్ర్యం సిద్ధించి ఎన్ని దశాబ్దాలు గడిచినా వంతులవారీగా రిజర్వేషన్ల కాలపరిమితిని పెంచడం, అంటరానితనాన్ని దూరం చెయ్యడానికి

చట్టాలు నిర్మించడం, నినాదాలు చెయ్యడం, వాగ్దానాల దొంతరలు పేర్చడం తప్ప ఏమీ చెయ్యలేకపొయ్యాము భారత పౌరులమయిన మనం.

హరిజనులపై అనుదినం జరిగే అన్యాయాలు, వారి గృహదహనాలు, వారి మూకుమ్మడి హత్యలు మామూలుగానే జరుగుతున్నాయి.

ఈ పరిస్థితుల్ని సహించలేక, మానవతా పతాకాన్ని ఉన్నత శిఖరాలపై ఎగురవేసి ఈ వైజ్ఞానిక యుగంలో తమ పట్ల జరుగుతున్న పాశవిక వైఖరిని భరించలేక, మానవ అగౌరవాన్ని, సమాజ నిరాదరణను చూడలేక, తమకు ప్రభుత్వం ప్రసాదించే రిజర్వేషన్లు, ఇతర అనేక సౌలభ్యాలు, సౌకర్యాలను వదులుకుంటూ వారు క్రైస్తవ, బౌద్ధ, జైన మతాలను లేక ఇస్లామ్ ధర్మాన్ని ఆశ్రయిస్తున్నారంటే మన అధిక సంఖ్యాక సోదరులు ఆత్మావలోకనం చేసుకోవలసిన, తమ వైఖరిని పరిశీలించుకోవలసిన అవసరం ఎంతో ఉంది.

ఈ దళిత వర్గాల వారు ముస్లిమ్‌లవడం చేత పొందేదేమిటీ? భారత దేశంలో స్వయంగా ముస్లిమ్‌లే విద్య, ఆర్థిక రంగాల్లో ఎంతో వెనుకబడి వున్నారు. వారి ధన, మాన, ప్రాణాలకు గత అనేక దశాబ్దాల నుండి దిన దిన గండం లాంటి వాతావరణమే ఎదురవుతోంది. ఇదంతా కళ్ళారా చూస్తూ హరిజనులు, తదితర దళిత వర్గాల వారు ధర్మపరివర్తనకు ఎందుకు సిద్ధమవుతున్నారు?!

దక్షిణ భారతంలో ఓ హరిజన వర్గం సవర్ణుల బాధలకు తట్టుకోలేక సమాజంలో సమానతను వెదుక్కుంటూ, తోటి సోదరుల వద్ద మానవ గౌరవాన్ని కాంక్షిస్తూ తమను మానవులుగా చూడగలిగిన సామాజిక వ్యవస్థలో శరణుపొందారు. వాళ్ళ ఈ చర్య కాస్తా పత్రికలకెక్కి రెండు రకాలుగా పరిణమించింది.

## పరిణామాలు

ఒకటి, వారిలాగే బాధలకు, అవమానాలకు, పరాభవాలకు గురవుతూ వచ్చిన ఇతర హరిజన సోదరుల్లో కొంత ధైర్యం, కొంత చొరవ, కాస్త ఆత్మగౌరవ కాంక్ష పెరిగాయి. పర్యవసానంగా దక్షిణ ప్రాంతంలోనే ఇతర చోట్ల కూడా అలాంటి హృదయ పరివర్తన వార్తలు వినరాసాగాయి. దానితో పాటు మధ్య భారతం, ఉత్తర భారత ప్రాంతాల్లోనూ ఈ ప్రభంజనం తన ప్రభావాన్ని చూపింది.

రెండో పరిణామం ఏమంటే, సంకుచిత సాంస్కృతిక ఉగ్రవాదులు, హిందూ మత సంస్కర్తలు, హైందవ సమాజోద్ధారకులు ఒక్కసారిగా ఉలిక్కిపడి, కళ్లు తెరచి, ఇంకా సరిగ్గా తేరుకోని నిద్ర మబ్బుల్లో, సమస్యను సాకల్యంగా, సమగ్రంగా అర్థంచేసుకోలేని మత్తుగొన్న నిద్రావస్థలో ఎదుట కనబడ్డవారిపై విరుచుకుపడసాగారు. ఈ దాడికి ఒక వైపున కొత్తగా హృదయ పరివర్తన కలిగిన, చైతన్యవంతులైన హరిజన సోదరులు గురైతే, రెండో వైపున ఈ మొత్తం కార్యక్రమంతో ఏ విధమైన సంబంధంలేని ముస్లిములు, వారి కొన్ని సంస్థలు ఈ ఆగ్రహ వాతనబడవలసి వచ్చింది.

తమిళనాడు రాష్ట్రంలోని రామనాథ్‌పురం జిల్లాలో లోగడ ఓసారి దాదాపు 100 మంది హరిజన సోదరులు ఇస్లామ్‌ను స్వీకరించిన సంఘటన కొన్ని మతోన్మాద వర్గాల్లో కలవరం సృష్టించింది. ఈ వర్గాల ప్రేరణతోనే పోలీసులు అమాయకులైన నవ ముస్లిములను అరెస్టు చేసి వారిని బెదరగొడుతున్నారు.

అటు పోలీసుల దౌర్జన్య చర్యలు, ఇటు ఇస్లామ్ వ్యతిరేక శక్తుల దుష్ప్రచారం మధ్య నవ ముస్లిములు కఠినాతి కఠిన పరీక్షల్ని ఎదుర్కోవలసి వచ్చింది. అయితే వారు దైవంపై భారంవేసి కష్టాలను మౌనంగా సహించారు. అరబ్ దేశాల్లో ఉద్యోగాల ఆశ, ధన ప్రలోభం కేవలం కట్టుకథలేనని ఈ నవ

ముస్లిములు ఎన్ని మార్లు చెబుతున్నా దుష్ప్రచారకులు ముస్లిములపై బురద చల్లే ధోరణిని విడనాడలేదు. అంతటితో ఊరుకోకుండా వారు ముస్లిములపై పోలీసులను ఉసికొల్పుతున్నారు.

ఈ పరిస్థితుల్లో ముస్లిములైనా, కొత్తగా ఇస్లామ్‌లో ప్రవేశించిన దళితులైనా సహనం వహిస్తూ దైవంపై భారం మోపడం తప్ప చెయ్యగలిగేదేముంటుంది?

## ప్రభుత్వానికి సూచనలు

"హరిజనులు" అన్న ప్రత్యేక పేరు పెట్టి, ఊరికి వెలుపల 'హరిజనవాడ' నిర్మించి, రిజర్వేషన్ల పేరుతో వారి ప్రత్యేకతను 'కాపాడి' లోగడ పాలకులు అవలంబించిన విధానాల వల్ల హరిజనుల పరిస్థితి ఆర్థికంగా ఎంతో కొంత మెరుగుపడినా వారి సామాజిక స్థాయి, స్థితిగతులు ఏ మాత్రం మారలేదు. వారికి తోటి పౌరులతో సమాన స్థానం, గౌరవం ప్రాప్తం కాలేదు. ఈ "సౌకర్యాల" వల్ల వారిలో ఆత్మన్యూనతా భావం పెరిగిందే తప్ప తరగలేదు. ఆత్మవిశ్వాసం జనించలేదు. వారి సామాజిక స్థాయి పెరగడానికి, వారిలో ఆత్మవిశ్వాసం ఏర్పడి పెంపొందటానికి అవసరమయిన చర్యల్ని అన్వేషించి గైకొనడం అత్యావశ్యకం. ఈ సందర్భంలో, కేవలం ఆర్థిక ప్రగతే అన్ని రకాల మేళ్ళకు ఆలవాలమన్న అపోహను, దురభిప్రాయాన్ని దూరం చేసుకోవడం అవసరం.

ఒకప్పుడు, అప్పటి సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి ఈ విషయంలో తమ శాఖా విధానాన్ని తెలుపుతూ దళితులకు కట్టిచ్చే ఇళ్ళు ఊరికి ఆవల కాకుండా అవి సాధారణ నివాస స్థలాలలోనే నిర్మించే యోచన తమకు ఉన్నట్టు తెలిపారు. ఈ చర్య దళిత ప్రజల అభ్యున్నతికి ఒక మంచి మెట్టుగా పరిణమించగలదని ఆశించటంలో తప్పులేదు. వారిలో విద్యను, అక్షరాస్యతను పెంపొందించడానికి అనేక చర్యలు గైకొనడం కూడా అవసరమే.

ఇంతవరకు ఈ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని విస్తృతపరచి ప్రాధాన్యతా ప్రాతిపదికపై వాటిని అమలు జరపడం, ఇంకా కొత్త పథకాలను రూపొందించి వాటిని ప్రవేశపెట్టడం పట్ల శ్రద్ధ వహించాలి.

వీటికి తోడుగా, అంటరానితనానికి, నిమ్నోన్నతా భావనలకు కేవలం నకారక (Negative) పద్ధతిలోనేకాక, సకారక (Positive) పద్ధతిలోనూ మానవుల మధ్య హెచ్చు తగ్గు భావనలు కేవలం కల్పితమయినవని ప్రబోధించేందుకు ప్రచార, ప్రసార సాధనాలన్నింటినీ వినియోగించి అన్ని స్థాయిల్లోనూ ప్రజల నుండి ఈ చెడుల్ని దూరం చేసే కృషి జరగాలి.

## న్యాయం చేకూర్చని రిజర్వేషన్లు

రిజర్వేషన్ల వల్ల నిరక్షరాస్యులు అక్షరాస్యులైతే హర్షించవచ్చు. ఈ ప్రత్యేక సదుపాయాల వల్ల అంటరానితనం, నిమ్నోన్నతల్లాంటి నీచ భావాలు అంతమయితే అంతకంటే ఆనందించదగ్గ విషయం మరొకటి ఉండదు. రిజర్వేషన్ పద్ధతి ద్వారా స్వాతంత్ర్య ఫలాలు నిరుపేదలు, నిరాధార జీవులకు పంపిణీ - న్యాయసమ్మతంగా - కాగలిగితే నాలుగు తరాల దారిద్ర్యాన్ని పారద్రోలినట్లే.

కాని వాస్తవానికలా జరగటం లేదు. ఒకనాటి మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఉటంకించినట్లు ధనికులు సయితం ఆ సదుపాయాలను ఒకవైపు పొందు తుండగా, ఆర్థికంగా చితికిపోతున్నవారు మరో వైపు ప్రభుత్వ ఉపేక్షకు గురవుతున్నారు.

పోనీ, ఈ రిజర్వేషన్ విధానం వల్ల నిమ్నజాతుల సామాజిక స్థితిగతులయినా మెరుగుపడ్డాయా అంటే అదీ లేదు. ఇక్కడా రాజకీయ పాచికలే పారాయి. ఫలానా తెగ, ఫలానా కులం, ఫలానా డివిజన్‌గా ఆయా ప్రజలను చీల్చి రాజకీయంగా ప్రయోజనాలను పొందాలని ఆశించారు

రాజకీయ నాయకులు. ఇళ్ళ స్థలాలు కేటాయించినా, బ్రహ్మాండమయిన క్వార్టర్లు కట్టించినా - మిగతా సమాజంతో సంబంధంలేని రీతిలో ఇళ్ళ కాలనీలను, పేటలను వేరుగా ఉంచడానికి ప్రయత్నించారు. పర్యవసానంగా ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక వసతులను వారు పొందినప్పటికీ, ఆర్థికంగా వారి స్థితిగతులు మునుపటికంటే ఎన్నో రెట్లు మెరుగయినప్పటికీ, సామాజికంగా ఈనాటికీ తాము ఎదగలేకపోయామన్న ఆత్మన్యూనతాభావం ఈ వర్గాల వారిలో ఉండిపోయింది. దీనికి బాధ్యులెవరు?

## హరిజనుల గౌరవాన్ని కాపాడండి

దేశాన్నుండి అంటరానితనాన్ని దూరం చెయ్యడానికి, దళిత వర్గాల సముద్ధరణకు రాజ్యాంగంలో ఎన్నో అంశాలు చేర్చబడ్డాయి. అయినప్పటికీ వీరి పరిస్థితి మెరుగుపడక అనుదినం దయనీయమవుతూ ఉందంటే అది ఒక స్వతంత్ర జాతిగా మనం సిగ్గుపడవలసిన విషయమే.

దేశ రాజకీయ వ్యవస్థలోనూ, సామాజిక జీవన పథంలోనూ కులతత్వం, ఒక అపరిష్కృత సంక్లిష్ట సమస్యగా పరిణమించింది.

బీహారు మరియు యు.పి. మాత్రమే కాక కర్నాటకలో కూడా ఈ ప్రత్యేక రిజర్వేషన్లు అమల్లోకి వస్తున్నాయి. అక్కడ 58 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు షెడ్యూల్డు కులాలవారికి కేటాయించబడ్డాయి. ఇందులో ప్రస్ఫుటంగా కానవచ్చే లోపం అటుంచి, ప్రజల్లోని ఒక వర్గం తరఫున ఎంత తీవ్ర ప్రతిఘటన ఎదురయినా ఎవరూ దాన్ని పట్టించుకోకపోవడం, ఈ పాలిసీపై పునఃపరిశీలన జరగాలని ఏ ఒక్కరూ తలపోయకపోవడం విచారకరమయిన విషయం.

ఈ రిజర్వేషన్ల గొడవ అగ్రకులాల్లో అశాంతిని, ఉద్రిక్తతను సృష్టించిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. దాని ప్రభావం ప్రభుత్వ కార్యదక్షతపై

పడుతుందన్నది కూడా నిర్వివాదాంశమే. ఈ సందర్భంలో కేటాయింపులకు వ్యతిరేకంగా జరిగిన విధ్వంసకాండ గమనార్హం. ఎన్నెన్నో విధాలుగా అగ్రకులాలు, తమ కోపతాపాలు ప్రదర్శించాయి. ఇంతవరకు ఈ కోపావేశాలు ప్రతిఘటనా ప్రదర్శనలు ప్రభుత్వం వైపునకే మరలి ఉన్నాయి. వెనుకబడ్డ వర్గాల వైపు మరలే ప్రమాదమూ లేకపోలేదు.

ఈ రిజర్వేషన్‌ల వల్ల జరిగిన గొప్ప నష్టానికి మానవత రీత్యా కూడా ఎంతో ప్రాముఖ్యముంది. నిమ్న కులాల వారు శతాబ్దాల తరబడి పైవారు ప్రదానం చేస్తే అందుకునే స్థితి నుండి ఎదగలేకపోతున్నారు. వారికి అన్నింటికంటే ముఖ్యంగా కావలసిందేమిటంటే : వారి పట్ల సమాన ఆదరణాభిమానాలు సమాజంలో సృజించాలి; వారిలో ఆత్మ విశ్వాసాన్ని పునఃస్థాపితం చెయ్యాలి; వారి అహాన్ని మేల్కొల్పాలి; ఆత్మగౌరవంగల ప్రతి మనిషికీ, స్వతంత్ర దేశపు ప్రతి పౌరునికీ ఇవి జన్మహక్కులు. రిజర్వేషన్లు వారి ఈ ఆత్మాభిమానాన్ని, అహాన్ని దెబ్బతీస్తాయి. వారిలో నిమ్నతాభావాన్ని, ఇతరులపై ఆధారపడే మనస్తత్వాన్ని సృజిస్తాయి. పైనుదాహరించిన ఉన్నత గుణాలు అర్థించి పొందేవి కావు - లోనుండి సృజించబడాలి. కాని ఈ విషయం నిమ్న కులాల సోదరులకు, వారి విమోచన ధ్వజవాహకులకు బోధపడటం లేదంటే ఇది ఎంతో విచారకరమయిన విషయం.

## నేటి అవసరం

తరాలు గడిచిపోయాయి. పాత తరంలోని సామాజిక విలువలకు ఇపుడు కాలం చెల్లిపోయింది. దళిత బాలురు చదువుకుంటున్నారు. విద్య వారి ఆలోచనాసరళిని కొంత మార్చింది. వంగి, వంగి దణ్ణాలు పెట్టే రోజులు పోయాయి. అహాన్ని దెబ్బకొట్టే విధానాలు వారిని ఆవేదనకే కాదు, ఆవేశానికీ ఉక్రోశానికీ గురిచేస్తున్నాయి. వారు తిరగబడి అగ్రకులాలవారి భాషలోనే బదులిస్తున్నారు.

అయితే కొందరు మేధావులు పేర్కొంటున్నట్లు జాతీయ ఆస్తుల పంపకం ద్వారా ఆర్థిక సమానత్వం సిద్ధించినంత మాత్రాన, రాజకీయాధికారం లభించినంత మాత్రాన దళితులకు సామాజిక సమానత్వం సిద్ధిస్తుందా? దళిత యువకులు ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లయితే, అగ్రకులాలు వైవాహిక సంబంధాలు ఏర్పరచుకోడానికి సిద్ధపడతాయా?!

ముమ్మాటికీ కాదు. ఎందుకంటే, దీర్ఘకాలంగా నరనరాల్లో తిష్టవేసుక్కూర్చున్న సుపీరియారిటీ కాంప్లెక్స్ అంత సులభంగా సమసిపోదు. దళితులు తమలాగే మనుష్యులన్న అంగీకారం వారిలో రాదు. దీర్ఘకాలంగా దళితులలో ఉన్న ఆత్మన్యూనతా భావం అంత త్వరగా నిష్క్రమించదు. అగ్రకులాల అవకతవక చేష్టలను అనుకరించడమే సమానత్వం అన్న పోకడ ఆత్మన్యూనతా భావం నుండి పుట్టినదే. దళితులు తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకునేందుకు, తమదయిన ప్రత్యేక జీవన సరళిని నిర్మించుకునేందుకు దోహదపడే మార్గాలను అన్వేషించాలి. ఆత్మవిశ్వాసంతో ఆత్మగౌరవాన్ని నూతన శైలిలో నిర్వచించాలి. అనుకరణ ద్వారా ఆత్మగౌరవాన్ని పొందాలనుకోవడం ఆత్మన్యూనతా భావానికి మరో రూపు. ఉన్నత నైతిక విలువలతో కూడిన ఉత్తమ సమాజాన్ని దళితులు ఆవిష్కరించాలి.

సామాజిక మార్పులను సహృదయంతో ఆహ్వానించేందుకు అగ్రకులాలు సిద్ధం కానంతవరకు ఘర్షణలు తప్పవు. అగ్రకులాలు సామాజిక మార్పుల్ని అంగీకరించి ఆదరించే విశాల హృదయాన్ని ప్రదర్శించాలి.

భారత సమాజంలో కులాలు ఇంకా ఉన్నాయన్నది చేదు వాస్తవం. అయితే కులాల మధ్య ఘర్షణలకు కారణమవుతున్న సామాజిక వాతావరణాన్ని మార్చి కులాల మధ్య సుహృద్భావాన్ని, సమానత్వాన్ని నెలకొల్పే సామాజిక వాతావరణం ఏర్పడేందుకు స్వచ్ఛంద సంస్థలు, పత్రికలు, మేధావులు, నాయకులు కృషి చేయాలి. ఇది నేటి అవసరం.

సమతకు, భద్రతకు పీఠం వేసిన ఇస్లామీయ సంవిధానం - దివ్యఖుర్ఆన్ ఏమంటుందో తెలుసుకోవడం ఇక్కడ సందర్భోచితం. ఇస్లామ్ మానవుల మధ్య జాతి, వర్గం, తెగల విచక్షణ లేకుండా సర్వసమానతను కేవలం గుర్తించడమే కాదు, దాన్ని ఒక ప్రముఖ సిద్ధాంతంగా, పరమ సత్యంగా పరిగణిస్తుంది. "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుల (జంట) ద్వారా పుట్టించాము". అంటే మానవులంతా, పరస్పరం సోదరులన్న మాట. "మీ పరస్పర పరిచయం కొరకు మేము మిమ్మల్ని తెగలుగా, జాతులుగా చేశాము." *(ఖుర్ఆన్-49:131)*

దీని భావమేమంటే - మనుషుల్ని తెగలుగా, జాతులుగా, వర్గాలుగా విభజించడం కేవలం పరిచయం దృష్ట్యా మాత్రమే జరిగింది. ఒక జాతి లేక తెగవారు, ఇతర జాతి లేక తెగవారితో కలిసి మెలిసి సహాయ సహకారాలు అందించుకోడానికి ఇది దోహదకారి కాగలదు. మానవుల్లో ఈ విభజన ఒక జాతి, మరో జాతిపై ఆధిక్యత చూపడానికీ లేక ఒక జాతిని, మరో జాతి కించపరచి హీనంగా చూచి, క్షుద్రంగా భావించి, వారిపట్ల నీచంగా ప్రవర్తించ డానికీ, వారి హక్కులను కాజేయడానికి ఏ మాత్రమూ కాదు.

మహాప్రవక్త (సఅసం) ఉపదేశం ఇలా ఉంది: అరబ్బుకు అరబ్బే తరునిపైగాని, అరబ్బేతరునికి అరబ్బుపైగాని ఎలాంటి ఆధిక్యతలేదు. తెల్లవానికి నల్లవానిపైగాని, నల్లవానికి తెల్లవానిపైగాని ఆధిక్యతలేదు. మీరంతా ఆదమ్ సంతతి వారే, ఆదమ్ మట్టితో సృజించబడ్డారు.

మతం, కులం, వర్ణం, భాష, ప్రాంతం అంతా కల్పితం. అన్ని హద్దులూ అంతమవ్వాలి - "ప్రపంచ మానవులారా! ఏకంకండి" అంటూ నినదిస్తూ మానవులంతా సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలి.

- : సమాప్తం : -

సమతకు, భద్రతకు పీఠం వేసిన ఇస్లామీయ సంవిధానం - దివ్యఖుర్‌ఆన్ ఏమంటుందో తెలుసుకోవడం ఇక్కడ సందర్భోచితం. ఇస్లామ్ మానవుల మధ్య జాతి, వర్గం, తెగల విచక్షణ లేకుండా సర్వసమానతను కేవలం గుర్తించడమే కాదు, దాన్ని ఒక ప్రముఖ సిద్ధాంతంగా, పరమ సత్యంగా పరిగణిస్తుంది. "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుల (జంట) ద్వారా పుట్టించాము". అంటే మానవులంతా, పరస్పరం సోదరులన్న మాట. "మీ పరస్పర పరిచయం కొరకు మేము మిమ్మల్ని తెగలుగా, జాతులుగా చేశాము." *(ఖుర్‌ఆన్-49:131)*

దీని భావమేమంటే - మనుషుల్ని తెగలుగా, జాతులుగా, వర్గాలుగా విభజించడం కేవలం పరిచయం దృష్ట్యా మాత్రమే జరిగింది. ఒక జాతి లేక తెగవారు, ఇతర జాతి లేక తెగవారితో కలిసి మెలిసి సహాయ సహకారాలు అందించుకోడానికి ఇది దోహదకారి కాగలదు. మానవుల్లో ఈ విభజన ఒక జాతి, మరో జాతిపై ఆధిక్యత చూపడానికీ లేక ఒక జాతిని, మరో జాతి కించపరచి హీనంగా చూచి, క్షుద్రంగా భావించి, వారిపట్ల నీచంగా ప్రవర్తించ డానికీ, వారి హక్కులను కాజేయడానికి ఏ మాత్రమూ కాదు.

మహాప్రవక్త (సఅసం) ఉపదేశం ఇలా ఉంది: అరబ్బుకు అరబ్బే తరునిపైగాని, అరబ్బేతరునికి అరబ్బుపైగాని ఎలాంటి ఆధిక్యతలేదు. తెల్లవానికి నల్లవానిపైగాని, నల్లవానికి తెల్లవానిపైగాని ఆధిక్యతలేదు. మీరంతా ఆదమ్ సంతతి వారే, ఆదమ్ మట్టితో సృజించబడ్డారు.

మతం, కులం, వర్ణం, భాష, ప్రాంతం అంతా కల్పితం. అన్ని హద్దులూ అంతమవ్వాలి - "ప్రపంచ మానవులారా! ఏకంకండి" అంటూ నినదిస్తూ మానవులంతా సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాలి.

- : సమాప్తం : -